
సాక్షి గుంటూరు

ఆదివారం । 23 । మార్చి । 2025




సాగర్ నీటిమట్టం
విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 519.70 అడుగుల వద్ద ఉంది. కుడికాలువకు 7,033 క్యూసెక్కులు విడుదలవుతోంది.



చేప పిల్లలు విడుదల
విజయపురిసౌత్: అనుపు వద్ద కృష్ణా జలాశయంలోకి మత్స్యశాఖ అధికారులు 10 లక్షల చేప పిల్లలను శనివారం విడుదల చేశారు.



నృసింహుని సేవలో..
మంగళగిరి టౌన్: మంగళగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో మాజీ సీఎం ఎన్టీఆర్ తనయుడు మోహనకృష్ణ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఇంధనం ఆవిరి!

పెట్రోలు బొంకులుగా పలు బంకులు

గుంటూరు జిల్లాతో పాటు నగరంలోని పలు పెట్రోలు బంకుల నిర్వాహకులు నిబంధనలకు పెట్రోలు వదులుతున్నారు. కొలతల్లో వ్యత్యాసం.. నాణ్యత ఘోరం.. వసతులు మృగ్యం. ఇదీ అయా చోట్ల దుస్థితి. ఇంత జరుగుతున్నా అధికారుల తనిఖీలు, తీసుకున్న చర్యలు శూన్యం. బండికి కాస్త గాలి పెట్టండి అని వేడుకున్నా.. సిబ్బంది లేరంటూ, మిషన్ పనిచేయదంటూ.. వస్తే మీరే పెట్టుకోండంటూ సిబ్బంది విరుపైన సమాధానం.. ఇంధన పరిమాణం తగ్గిందేందని ప్రశ్నిస్తే ఎండకు ఆవిరి అవుతుందంటూ వింతైన జవాబు.. లీటరుకు ఎందుకు అ'ధనం'గా తీసుకుంటున్నారని అడిగితే మా దగ్గర ఇంతే అంటు కటువైన సమాధానం.. చిప్ మోసాలపై ఆరా తీయబోగా అంతా గప్'చిప్'గా సర్దుకోవడం. 'సాక్షి' బృందం జిల్లాలోని పలు పెట్రోలు బంకుల్లో పరిశీలన జరపగా ఆసక్తికర విషయాలు బయటపడ్డాయి.

- జిల్లాలోని పలు పెట్రోలు బంకుల్లో గోల్‌మాల్
- రికార్డులు కూడా సరిగా నిర్వహించని యాజమాన్యాలు
- కొలతల్లోనూ తేడాలు
- కనీసం గాలి మిషన్లు లేని బంకులు ఎన్నో.
- మంచినీరు, మరుగుదొడ్లు వంటి కనీస వసతులు నిల్
- నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలు
- తూతూ మంత్రంగా అధికారుల తనిఖీలు



నెహ్రూనగర్/ పట్నంబజారు/ గుంటూరు వెస్ట్: నాణ్యత ప్రమాణాలకు తిలోదకాలిస్తున్నారు...కొలతల్లోనూ తేడా చూపిస్తున్నారు...రికార్డుల నిర్వహణ కూడా అంతంతమాత్రమే.. జిల్లాలోని పెట్రోల్ బంకుల్లో తీరిది. పెట్రోల్ అమ్మకాల్లో పూర్తిస్థాయిలో గోల్‌మాల్ జరుగుతుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వినియోగదారులు గగ్గోలు పెడుతున్నా...అధికారుల తనిఖీలు కూడా తూతూ మంత్రంగానే జరుగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

అంతా గప్'చిప్'!

జిల్లాలో దాదాపు ప్రతి బంకు వద్ద పెట్రోలు లీటర్‌కి 5 ఎంఎల్ నుంచి 30 ఎంఎల్ దాకా తగ్గుతుంది. ఎందుకు తగ్గుతుందని బంకుల నిర్వాహకులను అడగ్గా వేసవి ఎండల వలన ఆవిరి అయిపోతుందని పేర్కొంటున్నారు. దీంతో పాటు అమౌంట్ ఫీడ్ చేసే కీబోర్డ్ వెనకాల చిన్న చిప్ ఉంటుందని...దీని ద్వారా పెట్రోల్ గన్‌లో మోసం జరిగే అవకాశం ఉందనే ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ చిప్‌ను మేనేజ్ చేసేందుకు రిమోట్ సిస్టం వచ్చిందని.. దాని ద్వారా ఎవరైనా అధికారులు తనిఖీకి వస్తే చిప్‌ను ఆఫ్ చేస్తారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా పెట్రోల్ బంకుల్లో 4 గన్‌లు ఉంటే ఒక గన్ మాత్రమే కరెక్ట్‌గా పనిచేస్తుందని.. మిగిలిన మూడు గన్‌లు సరిగా పనిచేయవని వీటి ద్వారా వినియోగదారులను దోచుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గుంటూరు జిల్లాలో పెట్రోల్‌కి రూ 3.74 పైసలు, డీజీల్‌కి రూ.2.20పైసలు బంకుల నిర్వాహకులకు కమీషన్ వస్తుంది. కల్తీ విషయానికొస్తే కేంద్ర ప్రభుత్వ నూతన విధాల కారణంగా కొంత తగ్గిందనే చెప్పాలి. అన్ని బంకుల్లో సీసీ కెమెరాలు ఉన్నాయి.

జిల్లాలో పెట్రోలు బంకులు : 189

రోజుకు పెట్రోల్ వినియోగం 2.60 లక్షల లీటర్లు

డీజిల్ వినియోగం 6.80 లక్షల లీటర్లు

తనిఖీలు నామమాత్రం..

జిల్లాలో మొత్తం 189 పెట్రోలు బంకులు ఉండగా, గుంటూరు నగరంలో సుమారు 30 పైగా ఉన్నాయి. అయితే వీటిల్లో పూర్తిస్థాయిలో నిబంధనలు అమలు కావడం లేదు. పెట్రోల్ బంకులను నిరంతరం సివిల్ సప్లయిస్‌తో పాటు తూనికలు కొలతల శాఖ, ఆయిల్ కంపెనీల సేల్స్ అధికారులు తనిఖీలు చేస్తుంటారు. బంకుల్లో కొలత తేడా వచ్చిందని భావిస్తే అక్కడ చెకింగ్ చేయమని అడగొచ్చు. తూనికలు, కొలతల శాఖ సర్టిపై చేసిన 5 లీటర్ల క్యాన్‌తో కొలిచి చూపాల్సిన బాధ్యత బంక్ యజమానులపై ఉంది. క్వాలిటీలో తేడా అని భావిస్తే అక్కడే ఫిల్టర్ పేపర్‌పై పెట్రోల్ పోసి తనిఖీ చేసి చూపుతారు. అయితే అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తుంటంతో అక్రమాలు జరుగుతున్నాయనే విమర్శలు లేకపోలేదు. కేసుల నమోదులో కూడా అంతంతమాత్రంగానే వ్యవహరిస్తూ... స్వలాభం కోసం అధికారులు వెంపర్లాడుతున్నారనే అభిప్రాయాలు లేకపోలేదు. పలు ఫిర్యాదులు మౌఖికంగా అందుతున్నప్పటికీ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.

రికార్డుల పరిశీలనతోనే సరి

జిల్లాలో భారీగా తనిఖీలు చేశామని చెబుతున్న అధికారులు కేవలం రికార్డులను నామమాత్రంగా పరిశీలించి చేతులు దులుపుకొంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అనుకున్న స్థాయిలో తనిఖీలు జరగటంలేదని సమాచారం. ఆయా శాఖలోని కొంత మంది కీలక వ్యక్తులు, సిబ్బంది తాము తనిఖీలకు వెళ్లే బంకులకు ముందుగానే సమాచారం అందిస్తున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో లీగల్ మెట్రాలజీ అధికారులు ఎటువంటి చర్యలు చేపడతారో వేచి చూడాల్సిందే.

నమోదైన కేసులు
(2024 ఏప్రిల్ నుంచి, 2025 ఫిబ్రవరి 28 వరకు)

శాఖ	కేసులు
సివిల్ సప్లయిస్	9
లీగల్ మెట్రాలజీ	16
వసూలు చేసిన జరిమానా రూ.1.74లక్షలు	

పాటించాల్సిన నిబంధనలు

- ఉచిత గాలి
- మరుగు దొడ్లు
- మంచినీరు
- జనరేటర్ సౌకర్యం
- అధికారుల ఫోన్ నంబర్లతో కూడిన బోర్డు (అందరికీ కనిపించే విధంగా)
- ప్రజలతో సిబ్బంది మర్యాదగా నడుచుకోవాలి



- గుంటూరు మాయాబజార్‌లోని ఓ బంకులో పెట్రోలు పరిమాణం లీటర్‌కి 50 ఎంఎల్ దాకా తగ్గింది. లీటర్ పెట్రోల్ ధర రూ.109.64 ఉండగా.. రూ.110లకు ఫిక్స్ చేశారు. దీని వల్ల వినియోగదారులు తీవ్రంగా నష్టపోతున్నారు.
- ఆర్టీసీ బస్టాండ్ ఎదురు ఓ బంక్‌లో పెట్రోలు ధర అధికంగా వసూలు చేస్తున్నారు. అరలీటర్‌కు రూ.54.82 వసూలు చేయాల్సి ఉండగా సిబ్బంది రూ.57 తీసుకున్నారు.
- ఇన్నర్ రింగ్ రోడ్డులోని ఓ బంక్‌లో పెట్రోలు పరిమాణం ఒక లీటర్‌కి 5 ఎంఎల్ నుంచి 7 ఎంఎల్ దాకా తగ్గింది.
- గుంటూరు నగరంలోని దాదాపు అన్ని బంకుల్లో ఖచ్చితంగా ఉండాల్సిన మంచినీరు, ఎయిర్ ఫెసిలిటీ, ఇతర వసతులు కనిపించ లేదు.

మాయాబజార్‌లోని బంక్‌లో లీటర్‌కి సుమారు 50 ఎంఎల్ దాకా తగ్గిన పెట్రోలు

కల్తీ, నాణ్యతా లోపాలపై ఫిర్యాదు చేయాలి



గతంలో కిరోసిన్ అందుబాటులో ఉన్నప్పుడు పెట్రోల్, డీజిల్‌లో కొంతవరకు కల్తీ నడిచింది. రాష్ట్రంలో కిరోసిన్‌ను నిలిపివేసిన తర్వాత కల్తీకి అవకాశం లేదనే చెప్పాలి. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం గతంలో పెట్రోల్‌లో కలపాల్సిన 7 శాతం ఇథనాల్‌ను 20 శాతానికి పెంచారు. కారణం పర్యావరణ కాలుష్యం పెరగకుండా చూసేందుకే. బంకుల్లో ఇబ్బందులు ఏర్పడితే తప్పక ఫిర్యాదు చేయాలి. నిబంధనలు పాటించని బంకు యజమానులకు ఫైన్ తప్పదు. ప్రజల్లో చైతన్యం చాలా ముఖ్యం.

– కోమలి పద్మ, జిల్లా పౌర సరఫరాల అధికారి, గుంటూరు

తూకంలో తేడా వస్తే సహించం

ప్రభుత్వ నిబంధనల ప్రకారం 5 లీటర్లకు 25 ఎంఎల్ తగ్గితే ఎటువంటి చర్యలు ఉండవు. అయితే కొలతల్లో తేడా ఉందని అనుమానం కలిగినా..ఏదైనా జరిగినా తక్షణమే అధికారుల దృష్టికి తీసుకురావాలి. నిబంధనలు పాటించని వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించం. తప్పనిసరిగా క్రయ విక్రయాల పట్టీని నిత్యం నమోదు చేయాల్సిన బాధ్యత పెట్రోలు బంకుల యాజమాన్యాలపై ఉంది. వీటిని పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.

–కొండారెడ్డి, అసిస్టెంట్ కంట్రోలర్, తూనికలు, కొలతలు శాఖ

ఎవరికి ఫిర్యాదు చేయాలి?



బంకుల్లో తమకు ఎటువంటి ఇబ్బంది కలిగినా సివిల్ సప్లయిస్, తూనికలు, కొలతల అధికారులతోపాటు దగ్గర్లోని తహసీల్దార్ కార్యాలయంలోనూ, ఆయిల్ కంపెనీల సేల్స్ ఆఫీసర్స్‌కు ఫిర్యాదు చేయొచ్చు. లేదా 1967 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేసి వివరాలు చేబితే వారు తగిన చర్యలు తీసుకుంటారు.

న్యూస్‌రీల్

బాజీబాబా దర్గాను సందర్శించిన హైకోర్టు జడ్జి



పెదకాకాని: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విద్యావతి శనివారం పెదకాకాని బాజీ బాబా దర్గాను సందర్శించారు. పెదకాకాని హజరత్ సయ్యద్ బాజీ షహీద్ అవులియా దర్గాకు విచ్చేసిన హైకోర్టు న్యాయమూర్తి విద్యావతికి సిబ్బంది దర్గా మర్యాదలతో స్వాగతం పలికారు. దర్గా చుట్టూ ప్రదక్షిణలు చేసిన న్యాయమూర్తి అనంతరం ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. దర్గా సిబ్బంది న్యాయమూర్తి విద్యావతిని శాలువాతో సత్కరించారు. ఈనెల 29, 30 తేదీల్లో ఉరుసు మహోత్సవం జరగనున్న నేపథ్యంలో రూ.5వేల నగదు విరాళంగా అందజేసినట్లు దర్గా సిబ్బంది తెలిపారు.

ఉగాది పండుగ ఏర్పాట్లు పరిశీలన



వెలగపూడి(తాడికొండ): తుళ్లూరు మండలం వెలగపూడి గ్రామంలోని రాష్ట్ర సచివాలయంలో ఈనెల 30వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉగాది వేడుకల కార్యక్రమంలో పాల్గొననున్న నేపథ్యంలో ఏర్పాట్లను శనివారం ఏపీ సీఆర్డీయే కమిషనర్ కన్నబాబు, గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠిలు పరిశీలించారు. వేడుకలు జరగనున్న ప్రాంతం, సభావేదిక, ఏర్పాట్లు పలు అంశాలను అధికారులతో చర్చించి పలు సూచనలు, సలహాలు జారీ చేశారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, సంయుక్త కలెక్టర్ ఎ భార్గవతేజ, ఆర్డీవో శ్రీనివాసరావు పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమయపాలన పాటించండి
– ఎక్సైజ్ డీసీ డాక్టర్ కె.శ్రీనివాసులు



నెహ్రూనగర్: మద్యం షాపులు, బార్ అండ్ రెస్టారెంట్‌ల నిర్వాహకులు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలను పాటించాలని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె.శ్రీనివాస్ సూచించారు. శనివారం జిల్లాలోని మద్యం షాపులు, బార్ అండ్ రెస్టారెంట్ నిర్వాహకులతో గుంటూరు 1 టౌన్ ఎక్సైజ్ స్టేషన్ వద్ద ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మద్యం డిపో నుంచి తీసుకువచ్చే లిక్కర్ వివరాల నమోదు పక్కాగా ఉండాలన్నారు. తప్పనిసరిగా సమయపాలన పాటించాలన్నారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ వి.అరుణకుమారి, ఏఈఎస్ ఎం.మారయ్యబాబు, ఎక్సైజ్ వన్ టౌన్ సీఐ లత, టూ టౌన్ సీఐ యశోధర ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల నివారణపై అవగాహన

కర్లపాలెం: లైంగిక వేధింపుల నివారణ, పోక్సో చట్టంపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ఆరో అదనపు జడ్జి కె.శ్యామ్‌బాబు చెప్పారు. కర్లపాలెం మండల పరిధిలోని పేరలి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జడ్జి కె.శ్యామ్‌బాబు మాట్లాడుతూ లైంగిక వేధింపులు, అశ్లీలత వంటి నేరాల వంటివి విచారించేందుకు ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేశారన్నారు. న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచితంగా పేదలు న్యాయ సహాయం పొందవచ్చునని చెప్పారు.

ఉద్యోగ నియామక ఉత్తర్వుల్లో తప్పిదాలు

- కాంట్రాక్టు ఉద్యోగానికి బదులుగా అవుట్‌సోర్సింగ్ అని టైపింగ్
- జీజీహెచ్ ఎస్టాబ్లిష్‌మెంట్ సిబ్బంది తీరుపై ఆందోళన



గుంటూరు మెడికల్: గుంటూరు గవర్నమెంట్ జనరల్ హాస్పటల్(జీజీహెచ్) కార్యాలయ ఉద్యోగుల తీరుపై రోజురోజుకు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆర్థో కార్యాలయంలో ఫార్మాసిస్టుల ప్రమోషన్‌లకు జీజీహెచ్ నుంచి జాబితాను పంపించే విషయంలో తప్పిదాలు చేసి మెమోలు పొందిన చరిత్ర ఇక్కడి కార్యాలయ ఉద్యోగులది. తాజాగా వీరి ఉదంతం మరోటి బయటపడింది. 19 పారా మెడికల్ పోస్టులకు గుంటూరు వైద్య కళాశాలలో రిక్రూట్‌మెంట్ నిర్వహించి శుక్రవారం అపాయిమెంట్ ఆర్డర్స్ ఇచ్చారు. శనివారం విధుల్లో చేరేందుకు ఆసుపత్రికి వెళ్లిన ఉద్యోగులకు నియామక ఉత్తర్వుల్లోని తప్పిదాలతో గుండె ఆగినంత పనైంది. కాంట్రాక్టు ఉద్యోగానికి నియామక ఉత్తర్వులు ఇవ్వాల్సిన చోట అవుట్‌సోర్సింగ్ పేరుతో తప్పుగా టైపింగ్ చేశారు. దీంతో ఆందోళన చెందిన ఉద్యోగులు తమ అపాయింట్‌మెంట్ కాగితాలపై తప్పిదాలను సరిదిద్దాలని కోరినా అదేమీ కాదులే టేకిటీజీగా తీసుకోండంటూ ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగం ఉద్యోగులు తాపీగా సమాధానం చెప్పడం అభ్యర్థులకు విస్మయం కలిగించింది. గట్టిగా అడిగిన కొంతమందికి పెన్నుతో సరిదిద్ది మరికొంత మందిని సోమవారం రావాలని ఆదేశించారు. కార్యాలయ ఉద్యోగులు చేసిన తప్పిదాలకు తాము ఇబ్బందులు పడాల్సి వస్తుందని అభ్యర్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా జీజీహెచ్ అధికారులు ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగంపై దృష్టి సారించి ఆసుపత్రి పరువు బజారున పడకుండా కాపాడాలని పలువురు కోరుతున్నారు.

పార్థసారథి అలంకారంలో నృసింహుడు



పార్థసారథి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్న నరసింహస్వామి

మంగళగిరి టౌన్: మంగళాద్రిలో వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీ నరసింహస్వామి ఆస్థాన అలంకారోత్సవాల్లో భాగంగా స్వామి వారు శనివారం పార్థసారథి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవ ఏర్పాట్లను ఆలయ ఈఓ రామకోటిరెడ్డి పర్యవేక్షించగా ఉత్సవ కైంకర్యపరులుగా మంగళగిరి పట్టణానికి చెందిన లంకా నాగేశ్వరరావు కుమారులు, ఆస్థాన కైంకర్యపరులుగా మంగళగిరి పట్టణానికి చెందిన పచ్చళ్ళ సుబ్రహ్మణ్యం కుమారులు వ్యవహరించారు.

నేడు శ్రీరంగనాయకులు అలంకారం...

లక్ష్మీ నరసింహస్వామి ఆస్థాన అలంకారోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారు శ్రీరంగనాయకులు అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారని, స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆలయ ఈఓ రామకోటిరెడ్డి కోరారు.

అక్రమార్జనకు దగ్గరిదారి

- రాజధానిలో రోడ్లను తవ్వేస్తూ మట్టి అక్రమ విక్రయాలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- రాత్రిళ్లు ఐదు చోట్ల భారీ యంత్రాలతో మట్టి లోడింగ్
- జేబులు నింపుకొంటున్న వ్యాపారులు, కాంట్రాక్టర్లు, వాహన యజమానులు



కృష్ణాయపాలెం - మందడం రోడ్డులో రాత్రిళ్లు జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: రాజధానిలో కాంట్రాక్టర్లు, కొంతమంది మట్టి మాఫియా రాబందుల్లా మట్టి తవ్వకాలు నిర్వహిస్తూ ప్రతిరోజు రూ.లక్షల్లో ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. వివరాల్లోకి వెళితే.. ఆంధ్రప్రదేశ్ సచివాలయానికి 5,6 కిలోమీటర్ల దూరంలోని కాజా టోల్‌గేట్ నుంచి గన్నవరం వరకు నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణానికి మట్టి తవ్వి కొత్త రోడ్డు నిర్మాణం చేపట్టారు. అయితే కాంట్రాక్టర్లు నిబంధనలకు విరుద్ధంగా ఈ మట్టిని కొంతమంది వ్యాపారులకు లారీ రూ.2వేలకు అమ్ముతుంటే ఆ వ్యాపారులు లారీ రూ.7వేల నుంచి రూ.8 వేలకు ఇతరులకు అమ్ముకుంటున్నారు. వాస్తవానికి ఈ మట్టిని తరలించేందుకు మైనింగ్‌శాఖ అధికారుల అనుమతి తీసుకోవాలి. అయితే సదరు కాంట్రాక్టర్ అవేవీ పట్టించుకోకుండా మట్టిని అమ్ముకోవడం ప్రారంభించారు. ఇదే అదనుగా కొంత మంది అక్రమార్కులు సైతం రాజధాని ప్రాంతంలో గతంలో ఏర్పాటు చేసిన రోడ్లను సైతం యథేచ్ఛగా తవ్వేస్తున్నారు.

పేదలకు ఇచ్చిన స్థలాల్లో సైతం..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదలకు నివాసాలుగా ఇచ్చిన స్థలాల్లో రోడ్లను సైతం కొన్ని చోట్ల తవ్వేశారు. రాత్రిళ్లు ఆ రహదారిపై మట్టిని తవ్వి ఒక ప్రాంతంలో డంపింగ్ చేసి ట్రాక్టర్ల ద్వారా సరఫరా చేసి అమ్ముకుంటున్నారు. అక్రమ మట్టి తవ్వకాల విషయంలో ఈ మధ్యకాలంలో పలు కేసుల్లో నమోదైన ఓ వ్యక్తి ఈ తవ్వకాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. రాజధాని గ్రామాలైన కృష్ణాయపాలెం శివారు, వెంకటపాలెం, మందడం శివారు ప్రాంతాల్లో, కొండవీటి వాగు రోడ్డుకు సంబంధించిన మట్టిని రాత్రికి రాత్రి వందల సంఖ్యలో లారీలు పెట్టి బయటకు తరలిస్తున్నారు. ఐదు గ్రూపులుగా ఏర్పడి ఎవరికి వారు పొక్లెయిన్లు తీసుకువచ్చి, హద్దులు నిర్ణయించుకుని మట్టి తవ్వకాలు చేసుకుంటూ జేబులు నింపుకొంటున్నారు.

కనిపించని పర్యవేక్షణ

రాజధానిలో వందలాది కంపెనీలు టెండర్లు దక్కించుకుని కాంట్రాక్ట్ వర్క్స్ చేస్తున్నాయి. పనులు నిర్వహించే దగ్గర ఎటువంటి సెక్యూరిటీని నియమించడం లేదు. దాంతో సూపర్‌వైజర్స్‌గా వ్యవహరించే వారు అక్రమాలకు పాల్పడుతూ రాజధానిలో సంపదను దోచుకుంటు జేబులు నింపుకొంటున్నారు. మట్టిని రాజధాని ప్రయోజనాలకు కాకుండా వివిధ ప్రాంతాలకు ట్రాక్టర్ల ద్వారా, లారీల ద్వారా తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు పట్టించుకున్న దాఖలాలు కనిపించలేదు.

నిబంధనలకు నీళ్లు

రాజధాని ప్రాంతంలో నిర్వహించే పనుల్లో కాంట్రాక్టర్లు నిబంధనలకు నీళ్లు వదిలి తమ లాభార్జన కోసం పనిచేస్తూ ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారు. దీనికి నిదర్శనం కాజాటోల్ వద్ద నుంచి గన్నవరం వరకు నిర్మించే రహదారిలో కాజా టోల్‌గేట వద్ద నుంచి వెంకటపాలెం శివారు వరకు రోడ్డు నిర్మించేటప్పుడు తవ్వే మట్టిని నిబంధనలకు విరుద్ధంగా అమ్ముకోవడమే. సదరు కాంట్రాక్టర్లు అవినీతికి దారి చూపడంతో కొంతమంది స్వార్థపరులు రాజధానిలో నిర్మించిన రహదారులను సైతం తవ్వేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రాజధానిలో చేపట్టిన అభివృద్ధి పనులపై నిఘా ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

జిల్లావ్యాప్తంగా ఎనిమిది శక్తి బృందాలు

జెండా ఊపి సేవలు ప్రారంభించిన జిల్లా ఎస్పీ



సేవలు ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం: జిల్లాలోని మహిళలు, చిన్నారుల సంరక్షణ కోసం శక్తి యాప్‌ను రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చినట్లు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ పేర్కొన్నారు. శక్తి బృందాలను శనివారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో జిల్లా ఎస్పీ పచ్చజెండా ఊపి ప్రారంభించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ శక్తి యాప్ సేవలను జిల్లాలోని మహిళలు, చిన్నారులకు అందించేందుకు ఎస్ఐ స్థాయి అధికారితో ఒక్కో బృందంలో ఆరుగురు పోలీస్ అధికారులు, సిబ్బంది విధుల్లో ఉంటారని అన్నారు. ఎనిమిది బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఒక్కో పోలీస్ సబ్ డివిజన్‌కు ఒక్కో బృందం చొప్పున ఆరు బృందాలను నియమించామన్నారు. మిగతా రెండు బృందాలు మహిళా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉంటాయన్నారు. ఈ బృందాలకు మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ సుబ్బారావు, సీఐ నారాయణ దిశా నిర్దేశం చేస్తారన్నారు. శక్తి పోలీస్ బృందాలు నిరంతరం పాఠశాలలు, కళాశాలలు వద్ద గస్తీ నిర్వహిస్తాయని పేర్కొన్నారు. శక్తి యాప్‌ను గూగుల్ ప్లేస్టోర్ నుంచి ఫోన్లలో డౌన్లోడ్ చేసుకుని వ్యక్తిగత సమాచారం నింపి, సేవలను పొందవచ్చునని ఎస్పీ సూచించారు. జిల్లా ఏఆర్ ఏఎస్పీ హనుమంతు, డీఎస్పీలు సుబ్బారావు, అబ్దుల్ అజీజ్, కె.అరవింద్, ఎ.భానోదయ, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ దుర్మార్గాలను ఎండగడదాం

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు

లక్ష్మీపురం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పార్టీ కార్యకర్తలు పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వర రావు పిలుపునిచ్చారు. స్థానిక కొత్తపేటలోని ఆ పార్టీ కార్యాలయంలో జిల్లా సమితి సభ్యుల సమావేశం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆకిటి అరుణ్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ముప్పాళ్ళ మాట్లాడుతూ ఈనెల 23 స్వాతంత్ర సమరయోధుడు భగత్‌సింగ్ వర్ధంతి నుంచి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఏప్రిల్ 14 వరకు దేశ వ్యాప్తంగా సీపీఐ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో మోడీ నిరంకుశ పాలన ప్రైవేట్, కార్పొరేట్ అనుకూల, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న ఎన్డీఏ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచారం నిర్వహించాలన్నారు.

నోటి క్యాన్సర్ నివారణకు కృషి చేయాలి

- రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ డాక్టర్ టి.కృష్ణబాబు
- సిబార్‌లో జాతీయ దంత వైద్యసదస్సు



జ్యోతి ప్రజ్వలనలో పాల్గొన్న డాక్టర్ టి.కృష్ణబాబు, వైద్యులు

పెదకాకాని: ప్రభుత్వం ఆధ్వర్యంలో నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నామని రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ డాక్టర్ టి.కృష్ణబాబు అన్నారు. ఓరల్ మెడిసిన్, ఓరల్ పథాలజీ, ఓరల్ సర్జరీ డిపార్ట్‌మెంట్‌లు సంయుక్తంగా నోటి క్యాన్సర్ నివారణకు కృషి చేయాలన్నారు. పెదకాకాని మండలం తక్కెళ్లపాడులోని సిబార్ దంత వైద్య కళాశాల గత రెండు రోజులుగా జరిగిన జాతీయ దంత వైద్య సదస్సు శనివారం ముగిసింది. ఈ సదస్సుకు సిబార్ కళాశాల డీన్ డాక్టర్ ఎల్.కృష్ణ ప్రసాద్ అధ్యక్షత వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కాన్ఫరెన్స్‌ను ప్రారంభించారు. అంతర్జాతీయ ఓరల్ పథాలజీ అసోసియేషన్ సెక్రటరీ డాక్టర్ కె.రంగనాథన్ గౌరవ అతిథిగా విచ్చేశారు. ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ రవికిరణ్ స్వాగతోపన్యాసం చేశారు. డాక్టర్ టి.కృష్ణబాబు మాట్లాడుతూ సిబార్ దంత వైద్య కళాశాల ఆధ్వర్యంలో జాతీయ దంత వైద్య సదస్సు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఓరల్ క్యాన్సర్, ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్, ఓరల్ మెడిసిన్, రేడియాలజీ, ఓరల్ సర్జరీ రంగాలకు చెందిన ప్రముఖ వైద్యులు, శాస్త్రవేత్తలు వక్తలుగా విచ్చేసి వారి అనుభవాలను తెలియజేశారు. ఈ కాన్ఫరెన్స్‌కు దేశ నలుమూలల నుంచి 500 వరకు ఓరల్ మెడిసిన్, ఓరల్ పథాలజీ, ఓరల్ సర్జరీ నిపుణులు, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు పాల్గొన్నారు. ఇండియన్ అకాడమీ ఆఫ్ ఓరల్ మెడిసిన్ అండ్ రేడియాలజీ అధ్యక్షుడు డాక్టర్ శ్రీకృష్ణ, కార్యదర్శి డాక్టర్ శివ ప్రసాద్, ట్రెజరర్ డాక్టర్ అవినాష్ తేజస్వి, ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ రవికిరణ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ సమత, ట్రెజరర్ డాక్టర్ సేతు మంజూష, సైంటిఫిక్ చైర్మన్ డాక్టర్ పూర్ణ చంద్ర రావు నాయక్, సిబార్ దంత వైద్య కళాశాల డీన్ డాక్టర్ కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

భార్యను హింసిస్తున్న భర్తపై కేసు నమోదు

అద్దంకి రూరల్: తనను భర్త శారీరకంగానూ, మానసికంగానూ హింసిస్తున్నాడని భార్య ఫిర్యాదు మేరకు ఎస్సై శనివారం రాత్రి కేసునమోదు చేశారు. ఎస్సై రవితేజ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని కలవకూరు గ్రామానికి చెందిన మంజుల రాజ్యలక్ష్మి, రామయ్యకు 14 ఏళ్ల కిందట వివాహం అయింది. వీరికి ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయి. మద్యానికి బానిసైనా రామయ్య భార్యను వేధిస్తూ ఈనెల 19వ తేదీన కర్రతో దాడిచేశాడు. దీంతో భార్యకు గాయాలయ్యాయి ఈ మేరకు మంజుల రాజ్యలక్ష్మి శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయటంతో కేసునమోదు చేశారు.

పోక్సో కేసుల్లో సున్నితత్వం అవసరం


మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి

గుంటూరులీగల్: పోక్సో చట్టం ప్రకారం బాధితులకు ఎలాంటి సహాయం అందించాలి, ఇటువంటి కేసులలో సున్నితత్వం అనేది ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారథి అన్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల మేరకు శనివారం గుంటూరులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియావుద్దీన్ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. గుంటూరు పోక్సో కోర్ట్ న్యాయమూర్తి ఏ అనిత మాట్లాడుతూ బాధిత మహిళా, చైల్డ్ కానీ న్యాయం కోసం కేసు ఫైల్ చేసి న్యాయస్థానాన్ని ఆశ్రయించినపుడు నేరం చేసిన వారికి శిక్ష విధించి బాధితులకు న్యాయం చేయగలమని వెల్లడించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) గుంటూరు సయ్యద్ జియావుద్దీన్ మాట్లాడుతూ కేసుల్లో బాధితులకు నల్సా పరిహార పథకం, లైంగిక దాడులకు గురైన వారికి రక్షణ పథకం 2012 ద్వారా, రాష్ట్ర ప్రభుత్వం అందించే పరిహార పథకం 2015 ద్వారా పరిహారం ఎలా పొందవచ్చునో వివరించారు. గుంటూరు ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ కె.విజయలక్ష్మి, ట్రైనీ న్యాయమూర్తులు, న్యాయమూర్తులు, పోలీస్ సిబ్బంది, ఇతర సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

నదుల సంరక్షణ ముఖ్యం

ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, గుంటూరు సహకారంతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియావుద్దీన్ మాట్లాడుతూ హిమనీ నదాల సంరక్షణ అనేది చాలా ముఖ్యమని అన్నారు. బొగ్గు, చమురు వనరులను తగ్గించి సహజ వనరులకు ప్రాముఖ్యత ఇవ్వాలన్నారు. మన తెలుగు రాష్ట్రాల్లో కూడా నీరు లేక ప్రజల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. రాబోవు తరాలకు నీటి విలువను తెలియజేయాలన్నారు. ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి మాట్లాడుతూ గ్లోబల్ వార్మింగ్ వలన పర్యావరణం కలుషితం అవుతుందన్నారు. అన్ని అవసరాలకు మున్సిపల్ వాటర్ వాడుకొని తాగునీటికి మినరల్ వాటర్ వాడుతున్నామని, ఖాళీ స్థలాల్లో ఇళ్లు నిర్మించడం, మొక్కలను పెంచకపోవడం ప్రపంచం బాగుండాలంటే ఇప్పటి తరం అభివృద్ధి పథంలోకి తీసుకురావడానికి నీటిని సంరక్షించడానికి తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన, డ్రాయింగ్ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, గుంటూరు ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ ఎండీ నజీనా బేగం, గుంటూరు డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వాటర్ రిసోర్స్ డిపార్ట్‌మెంట్ బి.ఆదిశేషయ్య, ప్యానెల్ అడ్వకేట్ కట్టా కాళిదాసు, పలు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

'98 డీఎస్సీ' మిగిలిన అభ్యర్థులకు న్యాయం చేయాలి

మంగళగిరి టౌన్: 1998 డీఎస్సీలో మిగిలిన బీసీ, ఎస్సీ, దివ్యాంగులు, మహిళా అభ్యర్థులకు న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళగిరి ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 1998 డీఎస్సీలో ఓసీలకు 50 మార్కులు, బీసీలకు 45, ఎస్సీలకు 40 మార్కులను కటాఫ్‌గా నిర్ణయించి ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చారని, కానీ ఆయా కేటగిరీల్లో తగినంత మంది అభ్యర్థులు అర్హత సాధించకపోవడంతో 5 మార్కులు తగ్గించి ఇంటర్వ్యూలకు పిలిచారన్నారు. గత ఎన్నికల్లో యువగళం పాదయాత్రలో తమ సమస్యలను నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్లామని, తాము అధికారంలోకి వస్తే సమస్యను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకుని విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ వెంటనే స్పందించి 8 జిల్లాలకు సంబంధించి నష్టపోయిన డీఎస్సీ అభ్యర్థులకు ఉద్యోగాలు కల్పించాలన్నారు. ఓబీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు వరప్రసాద్, 98 డీఎస్సీ రిమైనింగ్ క్యాండిడేట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సుహాసిని, జగ్గయ్య, శ్రీనివాసులు, మీరావలి, చంద్రయ్య, గోవిందరావు, మధుసూదన్‌రావు, జయరామయ్య, కె.జె.ఎస్. కుమార్ పాల్గొన్నారు.

9న వివాహం.. ఇంతలోనే విషాదం


డాక్టర్ శివాచారి (ఫైల్)

పెదకాకాని: వివాహమై 13 రోజులు కూడా కాకముందే గుండెనొప్పితో ఓ డాక్టర్ మరణించడం రెండు కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. కాళ్ల పారాణి కూడా ఆరకముందే ఆ నవ వధువు భర్తను కోల్పోయి తీవ్ర దుఃఖ సాగరంలో మునిగిపోయింది. వివరాల్లోకి వెళితే.. పెదకాకాని మండలంలోని వెనిగండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మూడేళ్లుగా డాక్టర్ శివాచారి (33) విధులు నిర్వహిస్తూ పలువురి మన్ననలు పొందారు. ఈనెల 9వ తేదీన శివాచారికి వైద్యురాలైన లావణ్యతో తిరుపతిలో వివాహం జరిగింది. అయితే ఆయనకు శుక్రవారం తెల్లవారుజామున గుండెనొప్పి రావడంతో కుటుంబ సభ్యులు విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి సర్జరీ చేయించారు. చికిత్స పొందుతున్న శివాచారి అదేరోజు రాత్రి మరణించాడు. మృతదేహాన్ని ఒంగోలులోని స్వగృహానికి తరలించారు. వైద్యుడి మృతదేహాన్ని పలువురు డాక్టర్లు, సిబ్బంది సందర్శించి నివాళులర్పించారు. గ్రామ మాజీ సర్పంచి కొండమడుగుల శ్రీనివాసరెడ్డి, పలువురు గ్రామ పెద్దలు వైద్యుడి కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సంప్రదాయ కళల పునర్వైభవానికి కృషి చేయాలి

కేంద్ర సంగీత, నాటక అకాడమీ సభ్యుడు డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి


లోగో ఆవిష్కరిస్తున్న డాక్టర్ రామలింగ శాస్త్రి, రామచంద్రరాజు, గజల్ శ్రీనివాస్

గుంటూరు ఎడ్యుకేషన్: భారతీయ సంస్కృతి, సంప్రదాయ కళల పునర్వైభవానికి కృషి చేయాల్సిన సమయం ఆసన్నమైందని కేంద్ర సంగీత, నాటక అకాడమీ సభ్యుడు డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి అన్నారు. శనివారం కలెక్టర్ బంగ్లారోడ్డులోని భారతీయ విద్యాభవన్‌లో ఏర్పాటు చేసిన భవన్స్ కల్చరల్ అండ్ ఫైన్ ఆర్ట్స్ అకాడమీని ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. డాక్టర్ రామలింగశాస్త్రి మాట్లాడుతూ ఆధునిక యాంత్రిక జీవనంలో మన పురాతన కళలైన సంగీతం, నాట్యం, చిత్రలేఖనం వంటివి కనుమరుగవుతున్నాయన్నారు. ఇటువంటి తరుణంలో భారతీయ విద్యా భవన్స్ ముందుకు వచ్చి సంస్కృతి, లలిత కళల అకాడమీని ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. ప్రతి విద్యార్థి బాల్యం నుంచే సంగీతం, నాట్యం, సాహిత్యం, గానం, చిత్ర లేఖనంవంటి కళలు నేర్చుకొని అద్భుత ప్రతిభావంతులుగా రాణించాలన్నారు. ప్రముఖ గజల్ గాయకుడు గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ లలిత కళలు మన భారత జీవన గమనంలో భాగమని, పాశ్చాత్య దేశాలు పుట్టక మునుపే మన దేశంలో నలంద, తక్షశిలా వంటి విశ్వవిద్యాలయాల్లో సంగీతం, నాట్యం, చిత్రలేఖనం వంటి అనేక కళల్లో శిక్షణా తరగతులను నిర్వహించి, భావితరాలకు అద్భుత కళారూపాలను అందించారని తెలిపారు. భారతీయ విద్యా భవన్స్ కార్యదర్శి పి.రామచంద్ర రాజు మాట్లాడుతూ అనేకమంది ప్రఖ్యాత కళాకారులకు జన్మభూమి అయిన గుంటూరులో అకాడమీను స్థాపించడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా వేదాంతం రామలింగేశ్వర శాస్త్రి చేతులమీదుగా అకాడమీ లోగోని ఆవిష్కరించారు. అనంతరం ప్రభుత్వ సంగీత నాటక పాఠశాల ప్రిన్సిపాల్ మార్చూరు హరిబాబు, శ్రీసాయి మంజీరా ఆర్ట్ అకాడమీ కార్యదర్శి కాజా వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, గాయత్రి మహిళా సంగీత సమ్మండలి ప్రధాన కార్యదర్శి శేషు రాణిని సన్మానించారు. సాహితీ సమాఖ్య కన్వీనర్ ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ, భారతీయ విద్యా భవన్ కోశాధికారి రామ్ సుభాష్, హిందూ కళాశాల తెలుగు విభాగాధిపతి ఎల్లాప్రగడ మల్లికార్జునరావు, ప్రిన్సిపాల్ హేమాంబ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు రౌడీషీటర్లపై పీడీ యాక్టు

ఎమ్మెల్యే ఒత్తిడితోనే అంటున్న కుటుంబ సభ్యులు

పట్నంబజారు: గుంటూరు ఈస్ట్ సబ్ డివిజన్ పాతగుంటూరు పోలీసుస్టేషన్ పరిధిలో ఇద్దరు రౌడీషీటర్లపై పీడీ యాక్టు నమోదయింది. పాతగుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్టీసీ కాలనీకి చెందిన టీడీపీ నాయకులు సయ్యద్ ఇంతియాజ్, సయ్యద్ ఫిరోజ్‌లు అన్నదమ్ములు. వీరిపై గత ఎనిమిది సంవత్సరాలుగా రౌడీషీట్ ఉంది. ఈక్రమంలో గత కొద్దిరోజుల క్రితం ఆర్టీసీ కాలనీలో జరిగిన ఒక ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన తూర్పు ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్‌కు వీరికీ మధ్య వివాదం జరిగింది. ఈ క్రమంలో ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌పై వీరు దాడికి యత్నించారు. గతంలో నుంచే టీడీపీలో నసీర్ అహ్మద్, ఇంతియాజ్ కుటుంబీకుల మధ్య వివాదాలు జరుగుతూనే ఉన్నాయి. దీనికి తోడు ఇంతియాజ్, ఫిరోజ్‌ల సోదరుడు ముజీబ్ కూడా టీడీపీ తూర్పు నియోజకవర్గ సీటును ఆశించి భంగపడ్డారు. దీంతో వీరిమధ్య వివాదాలు మరింత ముదిరాయి. వివాదం విషయాన్ని మనసులో పెట్టుకున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ ఉద్దేశ్యపూర్వకంగా వీరిపై పీడీ యాక్టు పెట్టించారని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. ఎన్నికల ముందు నుంచి అదును కోసం ఎదురు చూస్తున్న ఎమ్మెల్యే వీరికి ఉన్న రౌడీషీట్లను అడ్డు పెట్టుకుని ఇబ్బందులకు గురి చేయాలనే ఉద్దేశ్యంతో పీడీ యాక్టుతో పావులు కదిపారనే ఆరోపణలు లేకపోలేదు. పీడీ యాక్టు నమోదైన ఇంతియాజ్, ఫిరోజ్‌లను అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు వెళ్లిన నేపథ్యంలో వారు పరారీలో ఉన్నారని తెలిసింది. ఈ నేపథ్యంలో వారు టీడీపీ అగ్ర నాయకత్వాన్ని కలిసి విషయాన్ని వారికి దృష్టికి తీసుకుని వెళ్లనున్నట్లు సమాచారం.

కొనసాగిన అఖిల భారత పత్తి పథకం వార్షిక సమావేశం

గుంటూరు రూరల్: అఖిల భారత పత్తి పంట పరిశోధన పథకం (ఏఐసీఆర్‌పీ) వార్షిక సమావేశం రెండవ రోజు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం లాంఫాంలో కొనసాగింది. కార్యక్రమాన్ని భారత దేశ వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) క్రాప్స్ సైన్స్ విభాగం డీడీజీ డాక్టర్ డీకే యాదవ్ ప్రారంభించారు. అనంతరం నిపుణులు, శాస్త్రవేత్తలు, విత్తన పరిశ్రమ పరిశోధకులు, పత్తి పంట పురోగతి, భవిష్యత్తుపై చర్చించారు. నాగపూర్‌కు చెందిన ఐసీఏఆర్ సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఫర్ కాటన్ నుంచి క్రాప్ ప్రొటెక్షన్ విభాగం హెడ్ డాక్టర్ గజనన్ టి.బహిరే పత్తి ఏఐసీఆర్‌పీ వార్షిక నివేదికను వివరించారు. ఐసీఏఆర్ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ (వాణిజ్య పంటలు), డాక్టర్ ప్రశాంతకుమార్‌దాస్ మాట్లాడుతూ పత్తి ఉత్పత్తి నాణ్యత, స్వల్ప పంటకాల రకాలు, వ్యర్థం లేని ఉత్పత్తి కీలక పాత్రపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. పత్తి ప్రాజెక్ట్ మానిటరింగ్, అడ్వైజరీ కమిటీ (పీఎమ్‌ఏసీ) చైర్మన్ డాక్టర్ సీడీ మయి మాట్లాడుతూ రెండవ పత్తి టెక్నాలజీ మిషన్ లక్ష్యాలను వివరించారు. డాక్టర్ డీకే యాదవ్ మాట్లాడుతూ భారతదేశపు పురాతన సమన్వయ పరిశోధనా కార్యక్రమాల్లో ఒకటైన ఆల్ ఇండియా కోఆర్డినేటెడ్ కాటన్ రీసెర్చ్ ప్రాజెక్ట్ (ఏఐసీఆర్‌పీ) ప్రాముఖ్యతను వివరించారు. కస్తూరి కాటన్ ఇనిషియేటివ్‌ను ప్రస్తావించారు. కార్యక్రమంలో ఏఐసీఆర్‌పీ వార్షిక నివేదిక, బీటీ పత్తి ఇవాల్యుయేషన్ నివేదిక, ఆర్గానిక్ ప్రత్తి ఉత్పత్తి సాంకేతిక గైడ్ వంటి అనేక ప్రచురణలు విడుదల చేశారు. కార్యక్రమంలో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ఆర్.శారదజయలక్ష్మీదేవి, నిపుణులు, శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొన్నారు.

ఎయిమ్స్‌లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల నిరసన

మంగళగిరి: తమ సమస్యలు పరిష్కరించాలంటూ ఎయిమ్స్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు నిరసన తెలియజేశారు. నగర పరిధిలోని ఎయిమ్స్‌లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు శనివారం ఓపీ విభాగం వద్ద మౌన దీక్ష చేసి నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ గతంలో అవుట్ సోర్సింగ్ కాంట్రాక్టర్ కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం జీతాలు చెల్లించారని, కాంట్రాక్టర్ మారడంతో గత మూడు నెలలుగా ఇష్టం వచ్చినట్లు జీతంలో కోతలు విధించి ఇస్తున్నారన్నారు. జీతాలు విషయాన్ని నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లినా ఉపయోగం లేకుండా పోయిందన్నారు. వెంటనే తమ జీతాలు యథావిధిగా చెల్లించాలని డిమాండ్ చేశారు.